# బుగ్గి

"ఆడికి మల్లీఏంపోగాలం దాపురించినాదో, తిని తిన్నగుండలేక తగువుకు దిగినాడు. తన్నీ తిగిలీసేరు. మా మంచిపనే జరిగిందెదవకి. బుద్ది మాల్నెదవ జాత్తక్కువ గొల్లిగోడు–"

మరి పార్వతి నోటికి అడ్డులేదు. పేటకీళాయి దగ్గిర జనం పోగుపడి పోయి నీళ్ల గొడవే మర్చి పోయారు.

మరిడియ్య తన్నులు తినేసి, బండబూతులు తిట్టుకుంటూ వెళ్లిపోయాడు. పార్వతి నిజంగా చండికా అవతారమే అయిపోయింది. జనం ముక్కు మీద వేలు వేసుకున్నారు.

"ఆ లంజినించి కదా యింతా వచ్చింది. నన్నుసురు పెట్టింది నాయార్ల. ఇల్లాలి ఉసురుట్టిగా పోదు. తప్పకా నా వుసురు తగులుద్ది"

పార్వతి నోటికి అడ్డులేదు. అపర కాళికలా నిలబడి నోటి కొచ్చినట్టల్లా తిడుతోంది. అవును మరి ప్రాణం ఉసూరుమంటే తిట్టక ముద్దెట్టుకుంటారా?

తన మొగుడు చిట్టిమల్లిని మరిగి–తనను కాదని–ఆరునెల్లక్రితం ఆ బాడుకీతో లెగిసి పోయాడు. చిట్టిమల్లి రంభాకాదు, ఊర్వశీ కాదు. రంకు ముండ. చిట్టిమల్లి చిన్న కూచీ కాదు. కచ్చితంగా ముప్పయ్యేళ్లున్నాయి. మొగుడు తిన్నగా మనవకగాని లేకపోతే ఈ పాటికి నలుగురు పిల్లతల్లీ కావలసిందే. తనకంటే ఆరంటే ఆరేళ్లే చిన్నది. దాని మొగుడు తిన్ననయినోడుకాడు. ఆడో తాగుబోతు నాయాల. చిట్టిమల్లికి తల్లీ తండ్రీ వున్నారు. పాపం వాళ్లేం చెయ్యగలరు? లక్షణంగా పెళ్ళి చేసేరు. పెళ్లయేసరికి నారాయుడు బుద్ధిమంతుళ్ళాగే వున్నాడు. ఆ తరవాత బయట పడింది బండారం ఆ డొట్టి తాగుబోతు. కాని డబ్బు చేతులుంటే తాగయినా తాగేస్తాడు. బ్రాకెట్టాటయినా ఆడేస్తాడు. పెళ్ళానికి మాత్రం పైసా యియ్యవలసినోడు కాదు. నారాయుడు సైకిలు రిక్షా తొక్కుతాడు. రోజుకు నాలుగూ అయిదూ సంపాయిస్తాడు కాని బుద్ది స్తిరం లేదు. అడ్డమైన లంజిలతోనల్లా తిరగడం మరగి యిల్లుజేరడు. ఒక్కనాడు పెళ్ళాంతో సరదాగా ఉండెరగడు. అదిగో ఆదునులోనే చిట్టిమల్లీ మనుసు మరిడయ్య మీదికి మళ్లింది. మరిడయ్య తాలూకాఫీసుబంట్రోతు నలభయ్యేళ్లు పైనే వుంటాయిగాని– వాణ్ని చూసి ఎవరూ అంత వయసువాడనుకోరు. ముప్ఫయ్యేళ్లంటే యిట్టే నమ్మేస్తారు. మరెలా కుదిరిందో బంట్రోతు మరిడయ్యకి గొల్ల చిట్టిమల్లికీ కుదిరింది.

" దాన్నెంత పేణంగా చూసేదాన్నీ. అగ్గీసుకోలేదంటే నూకలిచ్చీదాన్ని కూరలేదంటే దాకలో నాకూ నా పెనివిటకి వున్నాదీ లేందీ కూడా సూడకంటా దానికిచ్చీదాన్ని– ఎంత పేణంగా చూసేను దాన్ని. ఆ తప్పుడు లంజికా యిస్వాసం యేవన్నా వుందా– కడకికాపరానికి కుంపటెట్టింది, నా మొగుణ్ని మాయజేయిస్సి వల్లోయేసేసుకుంది ఈ పేట మొత్తాన్ని నా మొగుడి పాటి మొనగాడే ఆ లమ్డికి దొరకలేదా– నా బతుకిలాగ జేసింది. దాన్ని అమ్మోరుదినెయ్యా– దాని తాడుతెగ– నా వుసురు తగిల్దా లంజికి–?"

పార్వతి నోటికి అడ్డూ ఆపూ లేదు. నోటి కొచ్చినట్టల్లా చెరిగి పోసేస్తుంది. నిప్పులు కురిపించేస్తుంది.

పార్వతీ చిట్టిమల్లీ నేస్తాలే, ఇద్దరూ సఖ్యంగానే వుండేవాళ్లు ఆ సఖ్యం యింత దూరం వస్తుందనీ, కడకు కాపరానికి నీళ్లదార వొదులుకోవలసి వస్తుందనీ పార్వతి అనుకోలేదు. చిట్టిమల్లి రంభాకాదు, ఊర్వశీకాదు. కాక పోతే "ఎర్రతోలు" అంతే.

చిట్టిమల్లీ గేదెల కన్నయ్య గుడిసెలో ఓ పక్క నాలుగు రూపాయల అద్దెయిచ్చి వుండేది. దాని మొగుడు దాన్నెప్పుడూ చెయ్యి చేసుకున్నవాడు వాడు. పూటుగా తాగేసి వొచ్చేవాడు. పెట్టినకాడికింత తిని పోతులాగపడుకునేవోడు చిట్టిమల్లికి మాత్రం కోరికలుండవా? కంటికీ మంటికీ ఏకధారగా అదెన్ని రోజులు ఏడుస్తూ గడిపిందో ఎవరికి తెలుసు? అది కూడా తోలీత బయపడింది కాని క్రమంగా అర్దమయింది. తనేమయిపోయినా ఆడికి పట్టదు. అచ్చంగా గంగలో కలిసి పోయినా ఆడికి పట్టదు. అయ్యో అన్న ముక్క అనవలసిన వాడు కాడు. తనమొగుడు. ఎందుకంటాడూ? తాగుడూ జూదమూ అణాకాణీ ముండలూ. ఇంతే, ఆడిలోకం తనకీ మరిడియ్యకి గల సంబంధం తెలిసి పోతుందేమోనని చిట్టిమల్లి తొలీత చెడ్డ భయపడి పోయింది. కాని ఆడు, అదీ పట్టించుకున్నట్టు లేదు ఛీ– ఆడేం మనిషి!

పార్వతి అలా అరుస్తూనే వుంది.

" తప్పతాగీసొచ్చినాడు తప్పుడు కూతలన్నీ కూస్తన్నాడు. దేవుడు, దేవుడిలాంటి మనిషిని ఎన్నెన్ని మాటలన్నాడు– అనబవిస్తాడు– నా తండ్రొకటీ పంతులు గారొకటీ కాదు. ఆర్సనుకుంటే ఆడికి నోట్లో పురుగులు కూడా పడతాయి. తప్ప తాగేసి తప్పుడు కూతలన్నీ కూస్తన్నాడు. ఎదవ సితక బోడీసీసి కాట్లోదోయించేసినా యీడికిదిక్కెవడు ఆ పంతులు బాబు దరమ దాత కాబట్టి సరిపోయింది గాని–"

పార్వతి కొక కూతురు.అది ఎదగొచ్చింది. మిఠాయి ఎంకునాయుడి యింట్లో ఒకపంచ నాలుగు రూపాయిల అద్దెకు తీసుకొని - నీయింట్లో పనికి కుదిరి బతుకు వెళ్ళదీసుకోస్తున్నాది పార్వతి.

పార్వతి పెద్ద అందగత్తేమీకాదు గాని అనాకారికాదు. వయసులో బహుఅందంగా ఉండి ఉంటుందన్న ఊహ, చూడగానేకలుగుతుంది. పసిచెడినా పసచెడని మనిసి పార్వతి. పంతులుగారింట్లో పనికి కుదిరింది. అదేంపెద్దపని రెండుపూటలా తిండి పెట్టి పదిరూపాయిలిస్తారు. అన్ని పనులూ చేస్తుంది. తెల్లారి కళ్ళాపి వెయ్యడం యిల్లుచక్కబెట్టి తుడవడం, నీళ్లుతోడటం, మొక్కలకి నీళ్లు పెట్టడం, అంట్లుతోమడం బట్టలుతకడం పిల్లల్ని ఆడించడం, పండగ పబ్బంవస్తే ఇల్లూవాకిలి కడగడం,దులపడం, సున్నాలు వెయ్యడం, పిండిదంపడం, ధాన్యం బాగుచెయ్యడం , పశువుల దగ్గర శుభ్రం చెయ్యడం - ఒక్కటేమిటి సమస్తమూ చేస్తుంది. పంతులుగారింట్లో కాక అల్లా ఎదురింటి మేడలో వుంటున్న తెలుగు మాస్టారింట్లోనూ, కరంటోళ్లింట్లోనూ (ఎలక్ట్రిసిటీ సూపర్‌వైజర్ గారిల్లు) పనిచేస్తుంది, చెరో ఆర్రూపాయిలిస్తారు తనకీ కూతురుకి తిండి వెళిపోయి - ఎంత లేదన్నా చేతిలో యిరవయి రూపాయిలుంటాయన్నమాట. దినం దివ్యంగానే వెళ్లిపోతుంది పార్వతికి.

చిట్టిమల్లితో లేచిపోయాక తగుమనుషులు మరిడయ్యను పిలిచి గడ్డిపెట్టారు. " నలభయ్యేళ్ళు దాటిన మనిషిలికదా. నీకిదేం పోయీకాలం" అన్నారు. వాటన్నిటికి తెగించేసి కూచున్నాడు, "నాయిష్టం" అన్నాడు. పార్వతి వెళ్లి తాసిల్దారుబాబు కాళ్ళట్టుకుంది. "నువ్వొక్క కాయితం రాసిపడే–వాడిపని పడతాను.' అన్నట్టు చూశాడు తాసిల్దారు. కష్టాలు చెప్పుకున్న పార్వతి వేపు అదోలా చూస్తూ "తప్పు తప్పు ఎంతచెడ్డా పెనిమిటి తాళికట్టాడు కాడా!" కాని పార్వతి ఒప్పు కోలేదు. కడకి– నెలకి డబ్భై రూపాయల మనోవర్తి యివ్వడానికి లోపాయికారి వప్పందం కుదిరింది.

నేటికి అయిదు నెలల్నించీ నెలనెలా డబ్భయి రూపాయల చొప్పున మరిడయ్య– పార్వతికి మనోవర్తి తీసుకొచ్చి యిస్తున్నాడు.

" అడికేలంజ చెప్పిందో– నేను మాపిటేల పంతులుగారింట్లో తొంగుంటన్నానని అదిగాని చూడొచ్చిందా? దానికేల? నాయిష్టం– నాయిష్టమొచ్చినోడింట్లో వుంటాను– మద్దినాలంజకెందుకు– ఆ చెప్పింది ఎవర్తో ఏపాటినీతిమంతురాలో రమ్మను– నేనూచెబుతాను. దానికెన్ని కన్నాలున్నాయో– నాకీ

పేటలో రంకులుతెలియనియికావు- తప్పుడు ముండలూ, తప్పుడు కూతలూ-"

పార్వతి నోటికి అడ్డూ ఆపూలేదు పార్వతి ఏడుస్తోందో, తిడుతోందో తెలీటం లేదు. తిడుతూ ఏడుస్తోంది. లేక ఏడుస్తూ తిడుతోంది.

" ఎలాగూ మొగుడొదిలేశాడుగదా నువ్వూ బరి తెగించేశావన్న మాట- పంతులు గారింట్లో రాత్రయ్యేదాకా నీకేటిపనంట" అని గట్టిగా మందలించేడు మరిడయ్య. వాడికి తన పెళ్ళాం మరోడితో పోవడం విపరీతమయిన కోపం తెప్పించింది. ఆ కోపంతోనే నాలుగందుకున్నాడు. పార్వతి ఒక్క పరుగున పంతులుగారి లోగిలిలోకి వెళ్ళింది. ఆ బాబు కాళ్ళమీద పడింది. " బాబు నన్ను పంపేసినాడు బాబూ " అని మొరపెట్టింది. పంతులు అడ్డు పడ్డాడు. ఆ వూపులో మరిడియ్యని నాలుగు అంది పుచ్చుకుని గడపవతలకి తోసేశాడు.

అప్పటికి పేటలో జనం అంతా పోగయి పోయారు. మరిడియ్య " నాదారి యెదవ " ఏం చేస్తాడూ? తిట్లకి లంకించుకున్నాడు.

" ఒరే పంతులూ- నన్నే చెయ్యిజేసుకుంటూవుగదరా నీ సంగతెవరికి తెల్దురా? వైజాగ్‌లో దూదేకులదాన్ని ఉంచుకున్న సంగతి తెలదనుకున్నావు- నువ్వియ్యాల నీతుల్జెప్తన్నావు- కడకి నా పెళ్ళాం కావలిసొచ్చింది- నువ్వు పెద్దోడివయితే నీ యెక్కువ నాకేటి- నా పెళ్ళాన్ని తన్నుకుంటాను- సంపుకుంటాను- నాయిష్టం- నువ్వెవడివిరా అడ్డుకోనానికి- నన్నుకొడతావురా"

పంతులుగారి మనుషులు మరిడియ్యని ఈడిచేసేరు. వాడు నానా తిట్లూ తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు. పార్వతి వీధినబడింది కొళాయి గట్టెక్కింది, తన బతుకు ఏనాడో బజారు పాలయి పోయింది అందుక్కాదు- దేవుడిలాంటి పంతులుబాబుని అనుకున్నందుకు- అర్ని నానా మాటలూ- అనరాని మాటలూ అన్నందుకు-

చిట్టిమల్లి కడుపుతోవున్నాదట. గంటస్తంభకాడ మొన్నాదివారం కనిపించిందని గడ్డెమ్మ చెప్పింది. పార్వతికి కళ్ళల్లో నిప్పులు పోసుకున్నట్టయింది. గుండెల్లో కుంపట్లు దేవినట్టయింది. మూడు పువ్వులూ ఆరు కాయలూగా వెలిగి పోవలసిన తన సంసారం యిలాగయి పోయినందుకు ప్రాణం మాచెడ్డవుసూరు మనిపించింది. తన సంసారం బుగ్గయి పోయింది.

ఇంతా చేస్తే మరిడయ్య తాత్పర్యం ఏమిటంటే

"పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం (ఎవరా పెద్ద మనుషులు? మిఠాయి కొట్టు ఎంకునాయుడూ వగైరాలు) నువ్వు నా తాళికట్టిన పెళ్ళానివి గనక- నెలకి డబ్బయి రూపాయలు మనోవర్తియిస్తన్నాను. కాని నువ్వునా పెళ్ళానివికాదని తేలిపోయింది. పంతులు బాబోటీ.... నీ తండ్రోటీ కాదని పైకి పేల్తానే వున్నావు- అక్కడ తొంగుంటానే వున్నావు. ఈ ముక్క పేట పేటంతా కోడయి కూస్తానే వుంది- మరలాటప్పుడు- నువ్వునా పెళ్ళానివి కానప్పుడు నీకు నేను డబ్బయిరూపాయిలూ ఎందుకియ్యాల?" అదీ వాడి పాయింటు.

మరిడియ్య తాలూకాఫీసు బంట్రోతయిన మాట నిజమే, కాని వాడంత చచ్చు మనిషి ఎందులో? -డబ్బుగుంజడంలో- మరోడు లేడు. తోటి బంట్రోతులు యిళ్ళు వేసేసుకుంటున్నారు. ఈ డొట్టి చచ్చు. అంచేత డబ్బు యిరకాటం ఒక సమస్య. యిన్నాళ్లూ పతివ్రతా తిలకంగా పేరు పొందిన "మరిడియ్య పెళ్ళాం పలానా పలానాగా తిరుగుతోందన్నది మరో సమస్య, వాడి బుర్ర పిచ్చిగా వుంది. పౌరుషం రెచ్చిపోతోంది. వాడి ఓర్పు చచ్చి పోతోంది. వాడిలో మనిషికి ఇదంతా నచ్చడంలేదు.

" జానేదేవ్– నువ్విచ్చేదేటి? నువ్వేనాడు చిట్టిమల్లిని లెగదీసుకు పోయావో ఆనాడే పోయింది నీకూ నాకూ సంబంధం– నువ్వియ్యాల కొత్తగా వచ్చి– నా పెళ్ళానివికావు నీకు నేను మనోవర్తి యియ్యనూ అండానికి నీ నోరెలా దిరిగింది– ఒక నాడు నువ్వు నన్ను పెళ్ళాంగా సూసేవేటి? పోన్లే- పోని ఇయ్యడం మానీ– ఆ డబ్బయి ఈకాయిలూ కూడా యియ్యడం మానీ– అయ్యి కూడా దానికే ఎట్టీ– దాని పిల్లలకే ఎట్టీ– అది నీకు రంబ- అదే నీవు యిల్లాలు– నారెక్కలు సల్లగుండాల– నాఒంట్లో సత్తువుండాల నేనే యింత సంపాయించుకునికలోగంజో తాగుతాను– లేన్నాడు పస్తుంటాను– నా బతుకెలాగూబుగ్గి జేయిస్సేవుగదా-"

పార్వతి నోటికి అడ్డులేదు దాని ప్రాణం ఉసూరుమంటోంది. దాని మనుసు గిల గిల గిల కొట్టుకుంటుంది. దాని ఆత్మ తిరగబడుతోంది-చండికలా తిరగబడమంటోంది కూడా– మగవాడి దౌష్ట్యం దానికీనాడు బోధపడి పోయింది. తన తప్పుకూడా తనకు స్పష్టంగా తెలుస్తూనే వుంది– అందుకు కారణం?

కొళాయి దగ్గిర బిందెలు తరగడం లేదు. నీటి ధార సన్నబడి పోతోంది. ఒక్కళ్ళు నోరు మెదపడం లేదా వేళ. పేట పేటంతా పార్వతి గొంతుకతో దద్దరిల్లి పోతోంది.

"నా బతుకిలా బుగ్గలు పోయింది."

రచన కాలం : 1976
ప్రచురణ : ప్రజాతంత్ర, ఫిబ్రవరి 78.